తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం - 08 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 279 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

**సీఎం సమక్షంలో ఆయుధాలతో పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టులు**

## హింసకు పరిష్కారం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం

## లొంగిపోయిన వారికి పునరావాసం, రక్షణ హామీ

**హైదరాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యలకు ఆయుధాలు, హింస ద్వారా పరిష్కారం దొరకదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ హైదరాబాద్‌లోని ఐసీసీసీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సమక్షంలో 130 మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారు తమ వద్ద ఉన్న 124 అత్యాధునిక ఆయుధాలను కూడా పోలీసులకు అప్పగించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఆయుధాలతో లొంగిపోవడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పిలుపును నమ్మి ముందుకు వచ్చిన మావోయిస్టులు జన జీవనంలోకి కలవడం శుభపరిణామమన్నారు. లొంగిపోయిన వారి ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. సాధారణ జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక సహాయం, ఇతర వసతులను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. మహాత్మా గాంధీ శాంతియుత పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు.

మిగతా 2లో..

## హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్ రెడ్డి

- క్యూర్ పరిధిలో ట్రై మున్సిపల్ కార్పొరేషన్లపై సమీక్ష
- ఇంటింటికీ చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు
- డంపింగ్ యార్డులు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణపై ఆదేశాలు



2లో

## డెలావర్ గవర్నర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

- విద్య, ఆరోగ్య రంగాల్లో సంస్కరణలపై చర్చ
- తెలంగాణ–డెలావర్ ద్వైపాక్షిక సంబంధాలపై దృష్టి
- గవర్నర్‌కు తెలంగాణ రైజింగ్–2047 విజన్ పత్రం అందజేత



2లో




## హౌసింగ్ బోర్డు రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభం

- 99 రోజుల్లో లక్ష్యాలు పూర్తి చేయాలని మంత్రి సూచన
- పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్లకు పరిష్కారం
- డిజిటల్ విధానంతో పారదర్శక సేవలు

2లో

## గద్దర్ ఫిల్మ్ అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తి

- విజేతల జాబితాను అందజేసిన జ్యూరీ సభ్యులు
- కళాకారులు, సాంకేతిక నిపుణులకు అభినందనలు
- తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించే అవార్డులు



2లో



# సమాజ సేవే వైద్యుల ప్రధాన ధ్యేయం కావాలి

### సిల్వర్ జూబ్లీ, కాన్వకేషన్ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి

### పట్టభద్రులైన యువ వైద్యులకు అభినందనలు

### వైద్య వృత్తిలో నైతికత, కరుణ ముఖ్యమని సూచన

**హైదరాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ సిల్వర్ జూబ్లీ మరియు కాన్వకేషన్ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన యువ వైద్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య వృత్తిలో ప్రతిభతో పాటు నైతికత, కరుణ అనే మూల సూత్రాలను ఎప్పటికీ మరవకూడదని ఆయన సూచించారు. వైద్య రంగంలో చదువు ఎప్పుడూ ముగియదని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. నిత్యం నేర్చుకుంటూ, పరిశోధనలు చేస్తూ ముందుకు సాగే వారే ఉత్తమ వైద్యులుగా గుర్తింపు పొందుతారని బట్టి విక్రమార్క పేర్కొన్నారు. వైద్య వృత్తి కేవలం ఉద్యోగం కాకుండా సమాజ సేవకు అంకితమైన గొప్ప బాధ్యత అని అన్నారు. ఈరోజు పట్టభద్రులైన యువ వైద్యులు సమాజ సేవను తమ వృత్తి ధ్యేయంగా తీసుకొని ప్రజల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం వ్యాఖ్యలు అబద్ధం: హరీశ్ రావు

- వరద కాలువలో ప్రవహిస్తున్న నీళ్లపై ప్రశ్నలు
- గాయత్రి పంప్ హౌస్ మోటార్లు నడుస్తున్నాయన్న మాజీ మంత్రి
- ప్రాజెక్టుపై తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారని విమర్శ



2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)



ఎంత పెద్ద సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని ఆయన అన్నారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, దామోదర్, రాజిరెడ్డి, చంద్రన్న తదితరులు తమ పునరావాసానికి సంబంధించిన ప్రతిపాదనలు తనకు తెలియజేశారని తెలిపారు. మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసం విషయంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 721 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. అవసరమైతే కేసుల పరిశీలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని సీఎం వెల్లడించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వదిలి లొంగిపోతే వారికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, అదనపు డీజీ విజయ్ కుమార్, ఐజీ సుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా తీర్చిదిద్దాలి: సీఎం

**హైదరాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు కీలక సూచనలు చేశారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. చెత్త సేకరణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి వాహనానికి ప్రత్యేక ప్రాంతాన్ని కేటాయించి నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. నగర పరిధి విస్తరించిన నేపథ్యంలో కొత్తగా గుర్తించిన డంపింగ్ యార్డులను త్వరితగతిన సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్తను సమీప డంపింగ్ యార్డులకు తరలించేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్మాణ రంగానికి సంబంధించిన వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సీఎం ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే నగరంలో పరిశుభ్రతను కాపాడడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, సీజనల్ వ్యాధుల నివారణకు తగిన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డెలావర్ గవర్నర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

**హైదరాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని అమెరికా దేశానికి చెందిన డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు విద్య, ఆరోగ్య రంగాల్లో సంస్కరణలు, డేటా భద్రత, యూనివర్సల్ హెల్త్ కేర్ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రాల మధ్య సహకారం పెంపు, అభివృద్ధి కార్యక్రమాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. సమావేశంలో డెలావర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి గవర్నర్ మాట్ మేయర్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు, రుణమాఫీ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ పథకాల అమలు విధానం గురించి కూడా ఆయన వివరించినట్లు సమాచారం. తెలంగాణ మరియు డెలావర్ రాష్ట్రాల మధ్య భవిష్యత్తులో మరింత బలమైన ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రతినిధుల బృందంతో అధికారిక పర్యటనకు డెలావర్ రాష్ట్రానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డెలావర్ గవర్నర్‌కు తెలంగాణ రైజింగ్-2047 విజన్ పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలు, భవిష్యత్తు ప్రణాళికలను ఈ విజన్ పత్రంలో వివరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డెలావర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్, వేం నరేందర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# ములుగులో మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క

- మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం
- ప్రతి పంచాయతీలో రూ.10 లక్షలతో భవనాల నిర్మాణం
- మహిళల ఐక్యత, స్వావలంబనకు ప్రత్యేక వేదిక

**ములుగు, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ములుగు జిల్లాలో 'మహిళా సమాఖ్య భవన్' పథకానికి రాష్ట్ర మంత్రి సీతక్క శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ఆమె శంకుస్థాపనలు చేశారు. గ్రామీణ మహిళల అభివృద్ధి, ఐక్యత మరియు ఆర్థిక స్వావలంబన కోసం ఈ పథకం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సమాఖ్య భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్కో భవనం నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు కేటాయించనున్నట్లు చెప్పారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడం, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు చేపట్టేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు ఒకే వేదికపై చేరి తమ సమస్యలను చర్చించుకోవడానికి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఈ భవనాలు సహాయపడతాయని మంత్రి వివరించారు. స్వయం ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా ఇవి ఉపయోగపడతాయని చెప్పారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆమె తెలిపారు.

# ఇంద్రవెల్లిలో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో కలెక్టర్ తనిఖీలు

- విద్యార్థినులకు వైద్య పరీక్షల పర్యవేక్షణ
- కిచెన్, స్టోర్ రూమ్‌ల తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

**ఆదిలాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ బాలికల కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్బీఎస్కే ఉట్నూర్‌బి బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను స్వయంగా పర్యవేక్షించారు. వైద్య బృందం నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు. అనంతరం కళాశాలలోని కిచెన్ మరియు స్టోర్ రూమ్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వ విధానం, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి రిజిస్టర్లలో అన్ని వివరాలను సమయానికి నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. తదుపరి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ వారితో ముచ్చటించారు. వారికి అందుతున్న ఆహారం, వసతి సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేలా పోషకాహారం అందించడంపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, అదనపు వైద్యారోగ్య అధికారి మనోహర్, కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్పెషలిస్ట్ వైద్యుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ బోర్డు రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభం

**హైదరాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. శనివారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పోర్టల్‌ను ప్రారంభించడంతో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న సుమారు ఐదు వేల రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్ మరియు హౌసింగ్ బోర్డు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు. హౌసింగ్ బోర్డు పరిధిలో ఇండ్లు, ఫ్లాట్లు, స్థలాలను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసిన పలువురు కేటాయింపుదారులు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాల్సి ఉందని అధికారులు మంత్రికి వివరించారు. కొంతమంది అసలు చెల్లించాల్సి ఉండగా, మరి కొందరు వడ్డీలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. కొత్తగా ప్రారంభించిన పోర్టల్ ద్వారా ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని వివరాలను ఒకే వేదికపై తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. కేటాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణలు, ఇతర లావాదేవీలను సులభంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరిగి పౌరులకు సేవలు మరింత చేరువవుతాయని ఆయన తెలిపారు. సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



# గద్దర్ ఫిల్మ్ అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా గాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ అవార్డుల విజేతల జాబితాను జ్యూరీ సభ్యులు ఆయనకు అందజేశారు. తెలుగు చలనచిత్ర రంగంలో ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేయడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన అందరికీ భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. కళాకారులు, సాంకేతిక నిపుణులు తమ ప్రతిభతో తెలుగు సినీ పరిశ్రమకు విశిష్ట సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. ఈ అవార్డులు వారి కృషికి గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా అవార్డుల ఎంపికను నిష్పక్షపాతంగా నిర్వహించిన జ్యూరీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ చిత్రాలు, ప్రతిభావంతులైన కళాకారులను గుర్తించి ఎంపిక చేయడం ద్వారా తెలుగు సినీ పరిశ్రమకు ప్రోత్సాహం లభిస్తుందని ఆయన అన్నారు. గద్దర్ ఫిల్మ్ అవార్డులు తెలంగాణ అస్తిత్వాన్ని, సామాజిక స్పృహను ప్రతిబింబించేలా భవిష్యత్తులో మరెందరో కొత్త కళాకారులకు స్ఫూర్తినిస్తాయని భట్టి విక్రమార్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం వ్యాఖ్యలు అబద్ధం: హరీశ్ రావు

**హైదరాబాద్, 7 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్న వ్యాఖ్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. హరీశ్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం వరద కాలువలో పారుతున్న నీళ్లు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చినవే కాదా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనిచేయకపోతే ఈ నీరు ఎలా వస్తుందని ఆయన నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంప్ హౌస్ మోటార్లు నడుస్తున్నందువల్లే ఈ నీరు ప్రవహిస్తున్నదని తెలిపారు. ప్రాజెక్టు పనితీరును ప్రజల ముందు తప్పుగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కీలకమైన సాగునీటి వనరుగా నిలుస్తోందని ఆయన అన్నారు. ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేయకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని హరీశ్ రావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందుతోందని ఆయన పేర్కొన్నారు.

# 99 రోజుల ప్రగతి మాటల్లోనే...
# యూరియా కోసం రైతుల పరితాపం

- ప్రభుత్వ ప్రగతి ప్రణాళికపై గ్రామీణ రైతుల ఆవేదన
- అల్వాల వెంకటరెడ్డి రైతు



**పెద్దమందడి,మార్చి7(తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకు తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రగతి ప్రణాళికలపై రైతుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణను రూపొందించి దాన్ని విజయవంతం చేయాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉన్నాయని రైతు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వరి పంట ఈనే దశకు చేరుకున్న సమయంలో అత్యవసరంగా అవసరమైన యూరియా గ్రామాల్లో దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతు నేతలు చెబుతున్నారు.దుకాణాల్లో యూరియా లేకపోతే యాప్‌లో ఎలా అందుబాటులో ఉంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.ఒకవేళ ఎవరైనా డీలర్ యాప్‌లో యూరియాను నమోదు చేసినా అది అర నిమిషం కూడా ఉండకుండా వెంటనే అయిపోతుందని, చదువుకున్న రైతులే దాన్ని పొందలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.ఈ పరిస్థితుల్లో సాధారణ రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని గ్రామీణ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల ప్రకటనల కంటే రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందించడమే ముఖ్యమని వారు సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రామాల్లోని రైతుల సమస్యలను ప్రత్యక్షంగా గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని రైతు అల్వాల వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.రైతుల ఆవేదనను పట్టించుకోకపోతే సామాన్య రైతుల ఉసురు ప్రభుత్వానికే తగులుతుందని ఆయన హెచ్చరించారు.



# ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

**వేలేరు, మార్చ్ 07 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మరియు నాయకుడు గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెరగాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం ఆధ్యాత్మికత, సహనం, సేవాభావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ముస్లిం సోదరులకు నూతన వస్త్రాలను బహుకరించి ఇఫ్తార్ విందు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేవారని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా అన్ని వర్గాల ప్రజలకు సేవ చేసే దిశగా పనిచేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గుజ్జుల శిరీష్ రెడ్డి, మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కొయ్యడా రాజు, మాచర్ల కనకరాజు, సూత్రపు సంపత్, ఎండీ జానీ, ఇట్టబోయిన సంపత్, పోలు తిరుపతి తదితరులు మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం క్లారిటీ

న్యూఢిల్లీ: మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా అనే సందేహం ప్రజల్లో నెలకొంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన ధరలను పెంచే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపాయి.










# నాగారం ఉన్నత పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు

**నాగారం, మార్చి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మార్చి 8 మహిళా దినోత్సవం ఆదివారం రావడంతో శనివారం పాఠశాలలో వేడుకలు జరిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీసీ రాములు మరియు ముఖ్య అతిథి డాక్టర్ శారద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జ్ ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పీసీ రాములు మాట్లాడుతూ ఇంట్లో గానీ, పాఠశాలలో గానీ మహిళలకు గౌరవం, సముచిత స్థానం కల్పించడం ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథి డాక్టర్ శారద మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ బాలికల ఆరోగ్య సంరక్షణ, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీనేజీ వయస్సులో జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.అలాగే బాలికలు తమ హక్కుల కోసం ప్రశ్నించాలనీ, భవిష్యత్తులో ఆర్థిక స్వాతంత్ర్యం సాధించేందుకు విద్య, నైపుణ్యాలు ఎంతో అవసరమని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాగి జావా, వారానికి మూడు సార్లు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లను వినియోగించుకోవాలని విద్యార్థినులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు శ్రీదేవి, సుమతి, మాలోత్ నాయక్, వందన, వరమ్మ, సంధ్యారాణి, అజీజ్ అహ్మద్, రమా సత్యశ్రీ, సరిత, పద్మ, కమల, గాయత్రీ, సుప్రజ, సంజయ్ రాణి, అర్చన, కౌసల్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆఫీస్ సిబ్బంది ఆనందం, దయ, విద్యా వాలంటీర్లు స్వప్న, శ్రీవిద్య, పావని, పవిత్ర మరియు పాఠశాల సిబ్బంది లక్ష్మి, సంధ్య, శోభలను ప్రధానోపాధ్యాయులు పీసీ రాములు, అరవింద్ కుమార్, మాలోత్ నాయక్, రఘు సన్మానించారు.

# నేరేడ్మెట్‌లో జన ఔషధి పథకం వార్షికోత్సవం

- ప్రజలకు తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు
- ఎంపీ ఈటల రాజేందర్

**నేరేడ్మెట్, మార్చి 07 (తెలంగాణ ముచ్చట్లు):**




మల్కాజ్గిరి నియోజకవర్గం నేరేడ్మెట్ డివిజన్ ఆర్కేపురం ఆఫీసర్స్ కాలనీలోని గీతా జ్ఞాన్ భవన్‌లో గోపు రమణా రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పథకం వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. నేరేడ్మెట్ మాజీ కార్పొరేటర్ కొతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ఎంపీతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న భారతీయ జన ఔషధి పథకం ద్వారా ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ పథకం వల్ల సాధారణ ప్రజలు, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు మరియు పేదలకు వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గుతున్నాయని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా వేలాది జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జన ఔషధి కేంద్రాల ద్వారా మందులు కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, శ్రవణ్, సీనియర్ నాయకులు కొతపల్లి ఉపేందర్ రెడ్డి, సత్యనారాయణ, సుధాకర్, శ్యామ్, సాయి, ఆకారం సాయి, మహాపాత్ర, సుదర్శని, ప్రసన్నతో పాటు కాలనీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటి వద్దనే కేసు నమోదు చేసిన మడికొండ పోలీసులు

**కాజీపేట్ మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు)**


ఇంటి వద్దనే కేసు నమోదు చేస్తున్న పోలీసులు

వృద్ధురాలైన తల్లిని కొట్టిన కేసును ఫిర్యాదు మేరకు కాజీపేట మండలం లోని మడికొండ పోలీసులు ఫిర్యాదురాలు ఇంటి వద్దకే వెళ్లి కేసును నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండలో నివసిస్తున్న వస్కుల శాంత (72) అనే వృద్ధురాలకు ఐదుగురు మగసంతానం ఆమె ఈనెల 6వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో మూడవ కుమారుడైన రామును భోజనం పెట్టమని అడగగా అతడు కోపంతో ఇష్టం వచ్చినట్లు తిట్టాడని వెంటనే పక్కన ఉన్న అతని భార్య సుమలత ఆమె నాలుగవ కుమారుని భార్య కల్పన ముగ్గురు వచ్చి ఇష్టం వచ్చినట్లుగా తిట్టి, ఆమె తలపై రాయితో కొట్టి కింద పడవేగా తల పగిలి ఎడమ చేయి విరిగిందనీ ఆమె పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలిసిన మరొక కుమారుడు శంకర్ తల్లిని ఎంజీఎంకు తీసుకువెళ్లాడు. ఆరోజు వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉండి 100కు డయల్ చేయగా మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ స్వయంగా వృద్ధురాలు ఇంటికి వచ్చి ఆమె వివరాలు చెబుతుండగా దరఖాస్తు రాసుకొని ఆమెను కొట్టినందుకు భారతీయ న్యాయ సహిత చట్టంలోని సెక్షన్లతోపాటు వృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని ఇన్స్పెక్టర్ విషయం తెలిపారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ డి జి పి శివధర్ రెడ్డి అద్భుతమైన ఆలోచనలతో పోలీస్ స్టేషన్ కు రాలేని స్థితిలో ఉన్నవారికి పోలీస్ వారే స్వయంగా ఇంటి వద్దకు వెళ్లి ఎఫ్ఐఆర్ చేయడం అనే విధానం మన దేశంలోనే మొదటిసారి మన తెలంగాణ పోలీస్ తీసుకువచ్చారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. వృద్ధులను దూషించిన కొట్టిన వారికి ఏ విధమైన ఇబ్బంది కలిగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ కిషన్ హెచ్చరించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అనంతరం కాపీని బాధిత మహిళకు అందజేశారు.






# మహిళలతోనే సమాజాభివృద్ధి.!

- విశ్వశాంతి విద్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు.

**సత్తుపల్లి, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**


సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాగిణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణంలో విశ్వశాంతి విద్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వశాంతి విద్యాలయంలో మహిళల కోసం రెండు రోజుల పాటు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయులకు డాక్టర్ రాగిణి బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాగిణి మాట్లాడుతూ కుటుంబానికి వెన్నెముకలైన మహిళలు తల్లిగా, కుమార్తెగా, సోదరిగా పిల్లలను ప్రేమతో పెంచి మంచి విలువలు నేర్పుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల వ్యక్తిత్వం, ప్రవర్తన, భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. మహిళలు సమాజంలో ప్రేమ, కరుణ, సహకారం వంటి విలువలను పెంపొందిస్తూ నాయకులుగా, శాస్త్రవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, సామాజిక సేవకులుగా ఎదిగి ప్రేరణగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ యాజమాన్యం నరుకుళ్ల సత్యనారాయణ, అవినాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వేసవిలో కూలర్ల వ్యాపారం లాభదాయకం

**హైదరాబాద్, మార్చి 7, డిజైనర్ టెక్ గురు ప్రతినిధి:**

వేసవి ప్రారంభం కావడంతో ఎండలు రోజురోజుకు తీవ్రంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది ఎయిర్ కూలర్లను ఆశ్రయిస్తున్నారు. ఎయిర్ కండీషనర్ల ధరలు అధికంగా ఉండటం, విద్యుత్ బిల్లుల భయం కారణంగా మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కూలర్ల వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని వ్యాపార అవకాశంగా మార్చుకుంటే కేవలం మూడు నెలల వ్యవధిలోనే లక్షల్లో ఆదాయం పొందే అవకాశం ఉందని వ్యాపార నిపుణులు సూచిస్తున్నారు.

ముఖ్యంగా విద్యార్థులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో చల్లదనం పొందేందుకు కూలర్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బ్రాండెడ్ కూలర్ల ధరలు ఎక్కువగా ఉండటంతో చాలా మంది తక్కువ ధరలో లభించే స్థానిక బ్రాండ్ లేదా అసెంబుల్ కూలర్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను సరిగ్గా ఉపయోగించుకుంటే తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,మార్చి7(తెలంగాణ ముచ్చట్లు):**



మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వనపర్తి మున్సిపాలిటీలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తొలి సంతకం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే ఫైల్‌పై చేసిన విషయాన్ని గుర్తు చేశారు.పాఠశాలల్లో 'అమ్మ ఆదర్శ కమిటీలు' ఏర్పాటు చేసి వాటికి మహిళలనే చైర్‌పర్సన్‌లుగా నియమించారని తెలిపారు.పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించడం వల్ల మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని చెప్పారు. అలాగే పాఠశాలల మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా మహిళల ద్వారానే నిర్వహిస్తున్నారని వివరించారు.మహిళలను ఆర్థికంగా బలపరిచేందుకు ఆర్టీసీ బస్సుల కొనుగోలులో భాగస్వామ్యం కల్పించి నెలకు సుమారు రూ.70 వేల ఆదాయం వచ్చేలా ప్రభుత్వం సహకరిస్తోందన్నారు.ఎలాంటి తనఖా లేకుండా ఒక్కో మహిళకు రూ.20 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు.హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద మహిళల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కోసం వేల కోట్ల విలువైన రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారని చెప్పారు. గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సమాఖ్యల ద్వారా నిర్వహించి వచ్చే కమిషన్ల ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేర్లపైనే మంజూరు చేయడం, రేషన్ కార్డులను మహిళల పేర్లతోనే జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.అదేవిధంగా మహిళలకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కూడా కల్పించామని పేర్కొన్నారు. రుణం తీసుకున్న మహిళలు మరణిస్తే ఆ రుణాన్ని మాఫీ చేసే చర్యలు కూడా ప్రభుత్వం తీసుకుందని వివరించారు.మహిళల పేర్లతోనే డీజిల్ బంకులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, వనపర్తి నియోజకవర్గంలోని పెబ్బేరు మండల కేంద్రంలో మహిళల పేరుతో తొలి డీజిల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళల నిర్వహణలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. మహిళలు తల్లిగా, భార్యగా, చెల్లిగా, అక్కగా అనేక రూపాల్లో సమాజానికి సేవలందిస్తున్నారని, అలాంటి మహిళలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ సందర్భంగా వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన మహిళా కౌన్సిలర్లను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. అలాగే మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళా కార్మికులను కూడా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మిడిదొడ్డి మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, మహిళా ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



## బాలికల హాస్టల్ కోసం స్థలం పరిశీలన.!

**కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదల ఇంటి కల సాకారం**
**మణిగిల్లలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ**

**పెద్దమందడి,మార్చి7(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో పేదల గృహ కలను నెరవేర్చాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కొత్త ఇంటి నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.గ్రామానికి చెందిన లబ్ధిదారు వడ్డే చిట్టెమ్మ (భర్త: వెంకన్న) కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంప్రదాయబద్ధంగా భూమి పూజ చేసి, ముగ్గు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడం ద్వారా వారి జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడమే ఇందిరమ్మ ఇండ్ల పథక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసిన వనపర్తి సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్ భారతయ్యకు దివ్యాంగుల వాహనం అందజేత

**వనపర్తి,మార్చి7(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పెద్దగూడెం ఉప సర్పంచ్ భారతయ్యకు దివ్యాంగుల వాహనాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి చేతుల మీదుగా అందజేశారు .ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ.. భారతయ్య తనకు దివ్యాంగుల వాహనం అందించాలని విన్నవించగా సంబంధిత అధికారులకు విషయం తెలియజేశామని తెలిపారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా భారతయ్యకు వాహనం మంజూరు చేయించామని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం దివ్యాంగులను సమాజంలో భాగస్వాములుగా చేసుకుంటూ వారికి అండగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, పెద్దగూడెం కాంగ్రెస్ నాయకులు కొండన్న, బాల్‌రాజు, బొట్టు శీను, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల్లో అక్రమ వసూళ్లు!

- ఆరుగురిపై కేసు నమోదు.
- సత్తుపల్లి ఇన్స్పెక్టర్ టి శ్రీహరి వివరాలు.

**సత్తుపల్లి, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**




ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలోని భూదాన్ మరియు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా దురాక్రమణ చేసి బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి ఇన్స్పెక్టర్ టి శ్రీహరి తెలిపారు.

ఎన్కూర్ గ్రామానికి చెందిన పోలెబోయిన బేబీ, పోలెబోయిన ముత్తయ్య, కల్తి రామచంద్రయ్య, పడిగ యెర్రయ్య, షేక్ అక్తర్, కుంజా కృష్ణలు కలిసి వెలుగుమట్లలోని సర్వే నంబర్లు 147, 148, 149లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా కేటాయిస్తామని చెప్పి మోసానికి పాల్పడ్డారని తెలిపారు.సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన గుడిమల్ల స్పందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తమ సంస్థ ద్వారా భూమి కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం ద్వారా పట్టాలు ఇప్పిస్తామని, జిల్లా కలెక్టర్ ద్వారా మీ పేర్లపై ప్లాట్ కేటాయిస్తామని చెప్పి ప్రతి ప్లాట్ 100 గజాలు ఉంటుందని నమ్మబలికి రూ.45,000 ఫోన్‌పే ద్వారా వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సత్తుపల్లి ఇన్స్పెక్టర్ వెల్లడించారు.





# బాలికల హాస్టల్ కోసం స్థలం పరిశీలన.!

- ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవతో మంజూరు.

**సత్తుపల్లి, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

స్థానిక పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల మరియు ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న బాలికల హాస్టల్ కోసం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ స్థానిక ఎంఆర్ఓతో కలిసి శనివారం స్థలాన్ని పరిశీలించారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చొరవతో ఈ హాస్టల్ మంజూరు కావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు. బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ హాస్టల్ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. హాస్టల్ ఏర్పాటు ద్వారా పరిసర ప్రాంతాల నుంచి చదువుకోడానికి వచ్చే విద్యార్థినులకు వసతి సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా

- అశ్వారావుపేట మండలంలో పర్యటన.
- కాలిన ఇల్లు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం
- మృతుల కుటుంబాలను పరామర్శ.

**అశ్వారావుపేట, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**


అశ్వారావుపేట మండలంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పర్యటించారు. గుమ్మడివల్లి గ్రామంలో నాజర్ ఆహ్వానం మేరకు ఆయన వారి నివాసానికి వెళ్లి గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులతో ఆత్మీయంగా మాట్లాడారు. స్థానిక రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకుని, భవిష్యత్తులో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై పలు సూచనలు చేశారు. కోయరంగాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు కారం మల్లయ్య ఇల్లు కాలిపోవడంతో అక్కడికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి ఆర్థిక సహాయం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఇల్లు మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తానని తెలిపారు. నారాయణపురం గ్రామంలో కాటూరి నాగయ్య మేనకోడలు (బోడపాటి వెంకటమ్మ కుమార్తె) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే బీఆర్ఎస్ నాయకుడు జక్కుల రాంబాబు తల్లి జక్కుల నాగమణి మృతితో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో కోయరంగాపురం సర్పంచ్ సోడెం చిన్ని గంగమ్మ, ఉప సర్పంచ్ మడివి లక్ష్మణ్, వార్డ్ సభ్యులు సెట్టిపల్లి కృష్ణారెడ్డి, ముత్తమ్మ, నాయకులు చందా లక్ష్మీనర్సయ్య, మిండ దుర్గారావు, మాజీ సర్పంచ్ చిచ్చోడు సీతారాములు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుర్సం వెంకటేశ్వరరావు, షేక్ అమీర్, పుట్ట సత్యం, చిమడబోయిన వెంకటేశ్వరరావు, సాయిల సత్యనారాయణ, శ్రీను, ముత్యాలరావు, హుస్సేన్, పోలిన నాగేశ్వరరావు, శంకర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుడికి చుక్కలు చూపిస్తున్న వైబ్రెంట్ ఎం.జి షోరూం

- కొత్త కారులో సాంకేతిక లోపం...
- 15 రోజులుగా రిపేర్ చేయని షోరూం
- న్యాయం చేయాలని బాధితుడి డిమాండ్

**కుషాయిగూడ, మార్చి 07(తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడలో ఉన్న వైబ్రెంట్ ఎం.జి మోటార్స్ షోరూం నిర్లక్ష్య వైఖరి వల్ల ఒక వినియోగదారుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన కారు సౌకర్యం ఇవ్వాల్సింది పోయి సమస్యలకు కారణమైందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. *వివరాల ప్రకారం..* బాధితుడు ఇటీవల ఎం.జి సంస్థకు చెందిన నూతన మోడల్ విండ్సర్ ఈవి కారును కొనుగోలు చేశారు. అయితే కారు కొన్న కొద్ది రోజులకే అందులో సాంకేతిక లోపాలు తలెత్తడంతో వాహనం నడపలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో బాధితుడు కారును కుషాయిగూడలోని వైబ్రెంట్ ఎం.జి షోరూంకు రిపేర్ కోసం అప్పగించారు.అయితే కారును షోరూంకు ఇచ్చి 15 రోజులు గడిచినా ఇప్పటివరకు సమస్యను పరిష్కరించలేదని బాధితుడు తెలిపారు. కారు ఎప్పుడు బాగవుతుందని అడిగితే షోరూం సిబ్బంది స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని, కారుకు సంబంధించిన వివరాలు కూడా తెలియజేయడం లేదని



ఆరోపించారు.కారు లేకపోవడంతో తన రోజువారీ పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని, మానసికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని బాధితుడు తెలిపారు. లక్షలు పెట్టి కారు కొంటే కనీస సర్వీస్ కూడా అందించడం లేదని, వెంటనే తన కారును రిపేర్ చేయాలని లేదా తగిన న్యాయం చేయాలని షోరూం యాజమాన్యాన్ని ఆయన డిమాండ్ చేశారు.ఈ విషయంపై ఎం.జి మోటార్స్ సంస్థ స్పందించి సమస్యను పరిష్కరించాలని, వినియోగదారులకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుంది

- అశ్వారావుపేటలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభం.
- పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం.

**అశ్వారావుపేట, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**



గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని శనివారం అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నూతన మున్సిపాలిటీ భవనాన్ని ఎమ్మెల్యే స్వయంగా శుభ్రం చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి తమ ప్రాంతాన్ని పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా, నాచారం సర్కిల్స్‌లో చెత్త సమస్యలకు వాట్సాప్ సేవ

- పంపితే వెంటనే స్పందన
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ చర్యలు

**కాప్రా, మార్చి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కాప్రా సర్కిల్-7 మరియు నాచారం సర్కిల్-8 పరిధిలోని ప్రజలకు మున్సిపల్ అధికారులు ముఖ్య గమనిక జారీ చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా ప్రత్యేక వాట్సాప్ సేవను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.
ప్రజలు చెత్త పేరుకుపోవడం, గ్రీన్ వేస్ట్, పొంగిపొర్లుతున్న చెత్త డబ్బాలు లేదా జివిపి (వల్నరబుల్ పాయింట్స్) వద్ద ఉన్న చెత్త సమస్యలను సులభంగా రిపోర్ట్ చేయవచ్చు. ఇందుకోసం 9063421300 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫోటోలు మరియు సమస్య ఉన్న ప్రాంతం యొక్క లొకేషన్ పంపితే సంబంధిత సిబ్బంది వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.ఈ విధానం ద్వారా మున్సిపల్ కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం లేకుండా ప్రజలు సులభంగా ఫిర్యాదులు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. త్వరిత ప్రతిస్పందనతో పాటు సరళమైన ప్రక్రియ ద్వారా నగర పరిశుభ్రతను మెరుగుపరచడం లక్ష్యమని వివరించారు. ప్రజలు ఈ సేవను వినియోగించి నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో సహకరించాలని కోరారు. మరిన్ని వివరాలకు mmc.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## యమ్నంపేటలో డ్రై గంజా పట్టివేత



- డెలివరీ బాయ్‌గా పని చేస్తూ గంజా విక్రయం
- నిందితుడి అరెస్ట్

**ఘట్‌కేసర్, మార్చి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం యమ్నంపేటలో పోలీసులు డ్రై గంజాను పట్టుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రూట్ వాచ్ నిర్వహిస్తున్న సమయంలో కారులో గంజా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం యమ్నంపేటకు చెందిన మొగులపల్లి శివ సాయి రెడ్డి (27) కారులో డ్రై గంజాను నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడని సమాచారం అందింది. దీంతో పోలీసులు యమ్నంపేటలోని రాక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎదుట ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా టిఎస్ 08 ఎం 2081 నంబర్ గల మారుతి బలెనో కారును ఆపి తనిఖీ చేయగా డ్రైవర్ సీట్ కింద అమెజాన్ డెలివరీ కవర్‌లో దాచిన 30 ప్యాకెట్ల డ్రై గంజా బయటపడింది. మొత్తం 1.540 కిలోల గంజాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితుడు అమెజాన్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి గంజా కొనుగోలు చేసి యమ్నంపేట, రాంపల్లి ప్రాంతాల్లో చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో అబ్బాసీ అలీ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. పోలీసులు గంజాతో పాటు కారును, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.





## మహిళల సాధికారతతోనే సమాజ ప్రగతి!

- జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.

**సత్తుపల్లి, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

మహిళల సాధికారతతోనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శనివారం సత్తుపల్లి మున్సిపాలిటీలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు విద్య, ఉపాధి, రాజకీయాలు, పరిపాలన తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు స్వయం ప్రతిభతో ఎదిగి కుటుంబం, సమాజ అభివృద్ధికి మరింతగా తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపాలిటీ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఎంఆర్వో, మహిళల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మున్సిపాలిటీ మహిళా కౌన్సిలర్లు, సీడీపీవో, వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, మహిళా నాయకులు, మున్సిపల్ మహిళా సిబ్బంది మరియు కార్మికులు పాల్గొన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజంలో విశేష సేవలు అందిస్తున్న మహిళలను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మహిళల పాత్రను కొనియాడుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర విశిష్టం

- - మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,మార్చి7(తెలంగాణ ముచ్చట్లు):**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మహిళా కౌన్సిలర్లను వనపర్తిలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మహిళా ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో విశిష్టమైందని అన్నారు. కుటుంబ అభివృద్ధితో పాటు తమకు అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు.మహిళలను గౌరవించడం మన సంస్కృతిని మరింత పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి రంగంలో మహిళలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సన్మానం పొందిన మహిళా కౌన్సిలర్లలో భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి, స్వాతి హరిబాబు, ఏర్వ. అరుణ శ్రీనివాసులు, శిరీష రమేష్ గౌడ్, శంకరమ్మ బాబు నాయక్, అయేషా సిద్ధిఖీ, మహిళా అధ్యక్షురాలు నాగమ్మ, జ్యోతి రమణ తదితరులు ఉన్నారు.కార్యక్రమంలో నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, విజయ్ కుమార్, గంధం పరంజ్యోతి, కౌన్సిలర్లు మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, మదన్, మహేశ్వర్ రెడ్డి, వెంకట్ సాగర్, మంద రాము, హర్షద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు .ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ఆవరణలో చెత్తను స్వయంగా శుభ్రం చేసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న బస్సు సౌకర్యం సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే డిగ్రీ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని వైస్ చాన్సలర్‌తో మాట్లాడి నిధులు కేటాయించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని, పరిశుభ్రత ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉండగలమని అన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెత్తను చెత్తకుండీల్లో వేయడం ద్వారా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే మలేరియా, డెంగీ వంటి వ్యాధులను నివారించవచ్చని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులు గ్రామ ప్రజలకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా ఏఐసీసీ అధ్యక్షులు నాగార్జున, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సీనియర్ నాయకులు రామ్‌జీ నాయక్, సురేష్, బాల్ రాజు, పాషా తదితరులు మరియు విద్యార్థులు

## స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా మహిళ దినోత్సవం

**ఖమ్మం బ్యూరో, మార్చి 7(తెలంగాణ ముచ్చట్లు)**






స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మహిళా ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రోల్ ఆఫ్ ఉమెన్ అనే అంశంపై ఉపన్యాస పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మాట్లాడుతూ ఆకాశంలో సగభాగంగా ఉన్న మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక శక్తిగా ఎదగాలని కోరారు. మహిళల ప్రాధాన్యతను తెలియజేసేందుకు తమ పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించామని తెలిపారు. మహిళలు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## డెలావేర్ గవర్నర్ హైదరాబాద్ పర్యటన

- ఈసీఐఎల్‌లో డా. ఏ.ఎస్. రావు విగ్రహానికి నివాళి

**కాప్రా, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**



అమెరికాలోని డెలావేర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరాన్ని సందర్శించారు. ఆయనతో పాటు ఆ రాష్ట్ర కార్యదర్శి చారుణి పాటిబండ సాంచెజ్, గవర్నర్ సతీమణి డా. లారీన్ మేయర్ మరియు భారత-అమెరికా దేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులతో కూడిన ప్రతినిధి బృందం కూడా నగరానికి చేరుకుంది.శనివారం నగరంలోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ప్రధాన ద్వారం వద్ద సంస్థ స్థాపకుడు ఏ ఎస్ రావు విగ్రహానికి చారుణి పాటిబండ సాంచెజ్ పుష్పమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మ్యాట్ మేయర్ మరియు ఇతర ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. ఏ.ఎస్. రావు దేశానికి శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రతినిధి బృందం ఈసీఐఎల్ సంస్థ కార్యకలాపాలు, పరిశోధనల గురించి అధికారులు నుంచి వివరాలు తెలుసుకుంది.హైదరాబాద్ నగరం ఐటీ, ఔషధ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, డెలావేర్ రాష్ట్రంతో వ్యాపార, పరిశోధన, పెట్టుబడి అవకాశాలను మరింత విస్తరించేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని ప్రతినిధి బృందం అభిప్రాయపడింది.ఈ సందర్భంగా డా. ఏ.ఎస్. రావు మనవరాలు చారుణి పాటిబండ సాంచెజ్ మాట్లాడుతూ తాత ఆశీర్వాదం కోసం ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి కృషి చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ సీఎండీ అనిష్ కుమార్ శర్మ, డా. ఏ.ఎస్. రావు కుమార్తె సుగుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించాలి

- వలస శంకర్ గౌడ్ జిల్లా సాహితి కళావేదిక అధ్యక్షులు



**వనపర్తి,మార్చి7(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడాన్ని నిషేధించాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. పిల్లల మానసిక ఆరోగ్యం, చదువులు మరియు వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణం నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన శనివారం ప్రకటనలో మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్నారులు అధికంగా సోషల్ మీడియాకు అలవాటు పడుతున్నారని అన్నారు.దీంతో పిల్లలు బయట ఆటలు ఆడడం మానేసి గ్రౌండ్లు ఖాళీగా మారుతున్నాయని పేర్కొన్నారు. సోషల్ మీడియా అధిక వినియోగం వల్ల పిల్లలు శారీరకంగా బలహీనంగా మారడంతో పాటు చదువుపట్ల నిర్లక్ష్యం పెరుగుతోందని తెలిపారు.మానసిక అభివృద్ధి కూడా దెబ్బతింటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.16 ఏళ్లకు ముందు పిల్లలు తప్పుదారులు పట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అందువల్ల వారి భవిష్యత్తు దృష్ట్యా సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ అవసరమని చెప్పారు. ఇప్పటికే కర్నాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఈ నెలలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని పరిశీలించి, 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడాన్ని నిషేధించేలా నిర్ణయం తీసుకోవాలని శంకర్ గౌడ్ కోరారు.



## ఏటీఎంలో డెబిట్ కార్డు ఇరుక్కుపోతే ఇలా చేయాలి

డబ్బు తీసుకునేందుకు ఏటీఎం వద్దకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు డెబిట్ కార్డు యంత్రంలోనే ఇరుక్కుపోయే పరిస్థితి ఎదురవుతుంది. అటువంటి సమయంలో చాలా మంది భయాందోళనలకు గురవుతారు. అయితే ఇది సాధారణంగా సాంకేతిక సమస్యల వల్ల జరిగే విషయం అని నిపుణులు చెబుతున్నారు. సరైన చర్యలు తీసుకుంటే ఖాతా భద్రతను కాపాడుకోవడంతో పాటు కార్డును తిరిగి పొందడం కూడా సాధ్యమే. ఏటీఎం మెషీన్‌లో కార్డు ఇరుక్కుపోవడానికి నెట్‌వర్క్ లోపాలు, విద్యుత్ అంతరాయం, తప్పు పిన్‌ను పదేపదే నమోదు చేయడం లేదా లావాదేవీ సమయంలో ఎక్కువ సమయం తీసుకోవడం వంటి కారణాలు ఉండవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో భద్రతా చర్యగా ఏటీఎం యంత్రం కార్డును తన వద్దే ఉంచుకుంటుంది. అలాంటి సమయంలో ముందుగా చేయాల్సింది మీ బ్యాంక్ కస్టమర్ కేర్‌కు వెంటనే సమాచారం ఇవ్వడం. ఏటీఎం మెషీన్ నంబర్, ఉన్న ప్రదేశం, సంఘటన జరిగిన సమయం వంటి వివరాలను బ్యాంకుకు తెలియజేయాలి. అవసరమైతే మీ కార్డును వెంటనే బ్లాక్ లేదా హాట్‌లిస్ట్ చేయాలని కూడా కోరవచ్చు. ఇలా చేస్తే ఎవరూ ఆ కార్డును ఉపయోగించి లావాదేవీలు చేయలేరు.

కస్టమర్ సర్వీస్‌ను సంప్రదించిన తర్వాత సాధారణంగా రెండు మార్గాలను సూచిస్తారు. మొదటిది కార్డును పూర్తిగా రద్దు చేసి కొత్త కార్డు కోసం దరఖాస్తు చేయడం. సాధారణంగా కొత్త కార్డు 7 నుంచి 10 రోజులలో మీ చిరునామాకు పంపిస్తారు.


రెండవది కార్డును తిరిగి పొందడం. మీ బ్యాంక్‌కు చెందిన ఏటీఎం వద్ద కార్డు ఇరుక్కుపోతే దాన్ని తిరిగి పొందడం కొంచెం సులభంగా ఉంటుంది. అయితే వేరే బ్యాంక్ ఏటీఎం వద్ద కార్డు ఇరుక్కుపోయి ఉంటే కొంత సమయం పట్టవచ్చు. యంత్రాన్ని నిర్వహించే సిబ్బంది కార్డును తీసి సంబంధిత బ్యాంకుకు పంపిస్తారు. అనంతరం బ్యాంక్ నుంచి కస్టమర్‌కు సమాచారం అందుతుంది. సాధారణంగా కార్డును తిరిగి పొందేందుకు కస్టమర్ తమ బ్యాంక్ శాఖకు వెళ్లి గుర్తింపు పత్రాన్ని చూపించాల్సి ఉంటుంది.

## ఎరువుల ధరలు పెరుగుదల

మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు కేవలం రక్షణ రంగానికే కాకుండా వ్యవసాయ రంగానికీ ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల ప్రభావంతో రసాయన ఎరువుల ధరలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది. ్రస్తుతం ఎరువుల తయారీలో కీలకమైన సహజ వాయువు సరఫరాలో అంతరాయం ఏర్పడడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. యూరియా, అమోనియం, అలాగే ఇతర ఎన్‌పీకే రకాల ఎరువుల తయారీలో సహజ వాయువు ప్రధాన ముడి పదార్థంగా ఉపయోగిస్తారు. మధ్యప్రాచ్య ప్రాంతాల్లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల కారణంగా గ్యాస్ సరఫరా తగ్గిపోవడంతో అనేక ఎరువుల తయారీ కేంద్రాలు ఉత్పత్తిని తగ్గించాయి. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఉత్పత్తిని నిలిపివేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. దీని వల్ల మార్కెట్‌లో ఎరువుల కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి. తాజా మార్కెట్ సమాచారం ప్రకారం కొన్ని రోజుల వ్యవధిలోనే యూరియా ధరలు గణనీయంగా పెరిగాయి. టన్ను యూరియా ధర 470 డాలర్ల వద్ద ఉండగా ప్రస్తుతం అది 550 డాలర్లకు పైగా చేరినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. ఈ పెరుగుదల వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఎరువుల ధరలు పెరగడం వల్ల రైతులు సాగు ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రయత్నించే అవకాశం ఉంది. దీంతో పంటల దిగుబడులపై ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఒక రైతు సాగు ఖర్చులో ఎరువుల వాటా సుమారు 40 నుంచి 50 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం ఎరువుల ధరలు పెరగడం వల్ల రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ముఖ్యంగా చిన్న మరియు మధ్య తరహా రైతులు ఈ పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. రైతులు అవసరమైనంత ఎరువులు ఉపయోగించలేకపోతే పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం పెరిగే అవకాశముందని వారు చెబుతున్నారు.

## ఘనంగా 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**ఖమ్మం బ్యూరో,మార్చి 07(తెలంగాణ ముచ్చట్లు)**



ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు ఆమంచి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రూరల్ మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జగదీష్,సర్పంచ్ బండి సతీష్,ఉప సర్పంచ్ షేక్ దావూద్,మాజీ ఏఎంసి చైర్మన్ పప్పుల విజయ,మాజీ ఎస్ ఎం సి చైర్మన్ పప్పుల రమణ, మాజీ జెడ్పీటీసీ పెరుమాళ్లపల్లి మోహనరావులు మాట్లాడుతూ...విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు ప్రతి సంవత్సరం కల్పిస్తున్నామని,గత ఏడాది 10వ తరగతి లో 100శాతం ఉత్తీర్ణత సాధించామని వారందరికీ ఇచ్చిన మాట ప్రకారం ప్రోత్సాహకాలను,నగదు బహుమతులను అందజేశామని, ఈ సంవత్సరం కూడా మంచిగా చదువుకొని గ్రామానికి,గురువులకు,తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పప్పుల రమాదేవి రిటైర్డ్ ఉద్యోగి ప్రతి సంవత్సరంలానే ఈసారి కూడా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు ,పెన్నులు అందించారు.గతేడాది ఉత్తీర్ణత సాధించిన మొదటి,రెండవ,మూడవ స్థానంలోని విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ మోహనరావు 3వేల 500 నగదును అందజేశారు.2వ వార్డు సభ్యులు తంగెళ్లపల్లి నారాయణమ్మ విద్యార్థులకు కంపాస్ బాక్స్, స్కేల్స్,పెన్సిల్స్ అందజేశారు. అలాగే కొత్తగా ఎన్నికైన ఏఎంసి చైర్మన్ రమాదేవి కి స్వాగతం పలుకుతూ మాజీ చైర్మన్ విజయకు వీడ్కోలు సన్మానం చేసిన అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగులమీరా,సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్,రిటైర్డ్ ఆర్.ఐ. కనకయ్య,ఉపాధ్యాయులు సతీష్,పార్వతి,కమల,వార్డు సభ్యులు కందుల భాస్కర్,గుండె తిరపయ్య, మోత్కురి లక్ష్మయ్య,విద్యార్థిని,విద్యార్థులు ,ఆఫిస్ సబార్డినేట్ రఫీ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రోడ్డుపై దుకాణాలు తొలగింపు

- ట్రాఫిక్ సౌకర్యం కోసం చర్యలు

**కాప్రా, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా సర్కిల్ పరిధిలో ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కుషాయిగూడ పాత కూరగాయల మార్కెట్ వరకు రహదారిపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, షెడ్లను శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. రహదారిపై ఏర్పాటైన ఈ తాత్కాలిక దుకాణాలు, నిర్మాణాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు ఎంక్రోచ్‌మెంట్ తొలగింపు చర్యలు చేపట్టారు.మున్సిపల్ సిబ్బంది, పోలీసుల సహకారంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి రహదారిని ఆక్రమించిన షాపులు, షెడ్లను యంత్రాల సహాయంతో తొలగించారు. ముందస్తుగా దుకాణదారులకు నోటీసులు జారీ చేసి స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని సూచించినప్పటికీ కొందరు దుకాణదారులు స్పందించకపోవడంతో అధికారులు స్వయంగా తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కుషాయిగూడ పాత కూరగాయల మార్కెట్ వరకు ఉన్న రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా రహదారులపై అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ చర్యలతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి వాహనదారులకు, స్థానిక ప్రజలకు కొంత ఉపశమనం లభించనుందని అధికారులు తెలిపారు.

## ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే

- పదో తరగతి విద్యార్థులకు ఘన ఫేర్వెల్

**కుషాయిగూడ, మార్చి 07 (తెలంగాణ ముచ్చట్లు):**





ఎస్ఆర్‌డీజీ స్కూల్ ఈసీఐఎల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కుషాయిగూడలోని బంజారా కన్వెన్షన్ హాల్ ఆవరణలో శనివారం ప్రైమరీ తరగతుల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, పదో తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఉదయం 8:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ విద్యాసంస్థల డీజీఎం రాధికా రెడ్డిని స్కూల్ ప్రిన్సిపల్ జి. ప్రవీణ్,విద్యార్థులు కవాతు ద్వారా ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి. ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఆహ్వానిస్తూ స్కూల్‌లో విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో తీసుకుంటున్న చర్యలను వివరించారు.ముఖ్య అతిథి డీజీఎం రాధికా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో నాణ్యమైన విద్య అందించడంలో ఎస్ఆర్‌డీజీ స్కూల్ ముందంజలో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పై తరగతులకు ప్రమోట్ అవుతున్న ప్రైమరీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలతో చదువులో ముందుకు సాగాలని సూచించారు.అనంతరం పదో తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు ఫేర్వెల్ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం జాతీయ గీతాల ఆలాపన అనంతరం వందన సమర్పణతో ముగిసింది.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ జూనియర్ కాలేజీ కృష్ణ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సంపత్ కుమార్, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ స్వప్నలత, మెరిట్ ఇన్‌చార్జి పరమేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళా పోరాటాల స్ఫూర్తికి గుర్తుగా మార్చి 8

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- సమాన హక్కులు, శ్రామిక మహిళల ఉద్యమాల చరిత్రను గుర్తుచేసే రోజు

**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 07 (తెలంగాణ ముచ్చట్లు):**





ప్రపంచవ్యాప్తంగా మార్చి 8ను అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటారు. మహిళల హక్కులు, సమానత్వం, శ్రామిక హక్కుల కోసం జరిగిన చారిత్రక పోరాటాలను స్మరించుకునే రోజుగా దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.చరిత్రలో మహిళలు ఎదుర్కొన్న అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా క్లారా జెట్కిన్, రోజా లక్సెంబర్గ్ వంటి మహిళా నాయకులు మహిళా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచారు.వారి ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా మహిళల హక్కుల ఉద్యమాలకు దిశానిర్దేశం చేశాయి.1857లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో బట్టల మిల్లుల మహిళా కార్మికులు కఠినమైన పని పరిస్థితులు, తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా సమ్మె చేపట్టారు. ఆ ఉద్యమం మహిళా కార్మిక హక్కుల కోసం జరిగిన తొలి పోరాటాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అలాగే రష్యాలో "బ్రెడ్ అండ్ పీస్" నినాదంతో మహిళలు చేపట్టిన ఉద్యమం పెద్ద రాజకీయ మార్పులకు దారి తీసింది.గతంలో మహిళా కార్మికులు రోజుకు 14 నుంచి 17 గంటలపాటు కఠిన పరిస్థితుల్లో పని చేయాల్సి వచ్చేది. తక్కువ జీతాలు, ప్రసవ సమయం వరకు పని చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. మహిళలు ఫ్యాక్టరీల్లో పనిచేయడం ప్రారంభించడంతో వారు ఇంటి బానిసత్వం నుంచి బయటపడి సమాజంలో స్వతంత్ర వ్యక్తిత్వాన్ని సాధించారని పండితులు పేర్కొంటున్నారు.1977లో ఐక్యరాజ్యసమితి మార్చి 8ను అధికారికంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గుర్తించింది. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా మహిళల సమాన హక్కుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.భారతదేశంలో కూడా మహిళలు కులవ్యవస్థ, వర్గ దోపిడీ, వివక్ష, హింస వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులు, శ్రామిక మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మరియు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు & హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి. శోభారాణి మహిళల హక్కులు, సమాన అవకాశాల కోసం కొనసాగుతున్న పోరాటాలకు మహిళా దినోత్సవం ప్రేరణగా నిలవాలని పేర్కొన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## నెట్‌ఫ్లిక్స్ కీలక ఒప్పందం

**హైదరాబాద్, మార్చి 7,:**

ప్రముఖ ఓటీటీ దిగ్గజ సంస్థ నెట్‌ఫ్లిక్స్ కృత్రిమ మేధ సాంకేతికతను మరింతగా వినియోగించుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. హాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శకుడు బెన్ అఫ్లెక్ స్థాపించిన కృత్రిమ మేధ ఆధారిత ఫిల్మ్ టెక్నాలజీ సంస్థ 'ఇంటర్‌పాజిటివ్'ను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసింది. ఈ ఒప్పందంతో వినోద రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం మరింత విస్తరించనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సినిమా నిర్మాణ ప్రక్రియలో సాంకేతిక మార్పులకు ఇది దారితీసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

సినిమా నిర్మాణంలో అత్యంత క్లిష్టమైన దశగా భావించే పోస్ట్ ప్రొడక్షన్ పనులను సులభతరం చేయడమే ఈ కొనుగోలు వెనుక ప్రధాన ఉద్దేశ్యమని తెలుస్తోంది. ఇంటర్‌పాజిటివ్ అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ సాంకేతిక సాధనాలు సినిమా నిర్మాణంలో పలు సాంకేతిక పనులను వేగంగా పూర్తి చేయడంలో సహాయపడతాయి. ముఖ్యంగా లైటింగ్ సర్దుబాటు, ఫ్రేమ్ కూర్పు, అలాగే విజువల్ ఎఫెక్ట్స్ వంటి అంశాలను తక్కువ సమయంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో సినిమా ఎడిటింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా సాగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం మరియు వ్యయం అవసరమవుతుంటుంది. అయితే కృత్రిమ మేధ ఆధారిత సాధనాల ద్వారా ఈ పనులను తక్కువ సమయంలో పూర్తి చేయడం సాధ్యమవుతుందని నెట్‌ఫ్లిక్స్ భావిస్తోంది. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో పాటు సృజనాత్మక ప్రక్రియకు మరింత సమయం కేటాయించే అవకాశం దర్శకులకు లభిస్తుంది.

# మహిళా శక్తికి వందనం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అమిత మహిళల విద్య, స్వీయరక్షణ, స్వతంత్రతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. చాలా మందికి చదువు ఎంతో ముఖ్యమైనదైనా అది అందని ద్రాక్షలా అనిపించే పరిస్థితి ఉందని ఆమె పేర్కొన్నారు. తాము అంత దూరం వెళ్లలేమని భావిస్తూ కొందరు అక్కడికే ఆగిపోతున్నారని తెలిపారు. అయితే చదువుకుంటే ఎంత దూరమైనా ఎదగవచ్చని యువతికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. నిజ జీవితంలో విజయాన్ని సాధించిన మహిళల కథలు యువతికి స్ఫూర్తినిస్తాయని, మేరీ కోమ్ వంటి వ్యక్తుల ప్రయాణం చాలా మందికి మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు.

## మహిళలు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

**- అమితా,** ప్రభుత్వ ఉపాధ్యాయురాలు



అమ్మాయిలకు స్వీయరక్షణపై శిక్షణ ఎంతో అవసరమని అమిత పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపుల నేపథ్యంలో అమ్మాయిలు తమను తాము ఎలా కాపాడుకోవాలో నేర్చుకోవడం అవసరమని చెప్పారు. ఒంటరిగా ఉన్నప్పుడు లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలి, ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రస్తుతం అనేక రక్షణ పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ఉదాహరణకు చేతికి ధరించే ప్రత్యేక గ్లౌజులు వంటి పరికరాలు ఎవరైనా అనుచితంగా తాకితే వెంటనే హెచ్చరిక శబ్దం వచ్చేలా రూపొందించబడ్డాయని చెప్పారు. ఇటువంటి పరికరాలు మహిళల భద్రతకు సహాయపడతాయని అన్నారు. మహిళలు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని స్వతంత్రంగా నిలబడాలని అమిత సూచించారు. విద్య, ధైర్యం, స్వీయరక్షణ నైపుణ్యాలతో మహిళలు సమాజంలో ముందుకు సాగితే మరింత భద్రమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వరంగల్ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కంటి వైద్య నిపుణురాలిగా సేవలు అందిస్తున్న డాక్టర్ ఆశా దేవి మహిళలకు సందేశం అందించారు. మహిళా సాధికారతను ఒక్కరోజు కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రతి రోజూ ఆ ఆలోచనను ఆచరణలో పెట్టాలని ఆమె సూచించారు.

## మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

**- డాక్టర్ ఆశ దేవి**
కంటి వైద్య నిపుణురాలు



మహిళలు ఇంటి పనులు, బయట పనులు రెండింటినీ సమర్థంగా నిర్వహిస్తున్నప్పటికీ బయటికి వచ్చి మాట్లాడటానికి, తమ అభిప్రాయాలను వెల్లడించటానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నామో మహిళలే ఆలోచించుకోవాలని ఆమె అన్నారు. సమాజంలో ఉన్న కొన్ని కట్టుబాట్లను గౌరవిస్తూనే, మంచి సమాజ నిర్మాణం కోసం మహిళలు తమ వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. కుటుంబం అభివృద్ధి చెందాలన్నా, ఆ కుటుంబం నుంచి బయటకు వెళ్లే వ్యక్తులు సమాజంలో మంచి మార్పులు తీసుకురావాలన్నా తల్లి పాత్ర ఎంతో కీలకమని డాక్టర్ ఆశా దేవి తెలిపారు. ఒక మంచి తల్లి నుంచి మంచి కుటుంబం, ఆ కుటుంబం నుంచి మంచి సమాజం నిర్మితమవుతుందని చెప్పారు. మంచి సమాజాన్ని కోరుకుంటూ అందరూ కలిసి దానిని నిర్మిద్దామని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాయి సురక్ష ఆసుపత్రిలో ప్రసూతి, స్త్రీరోగ నిపుణురాలిగా సేవలు అందిస్తున్న డాక్టర్ రవళి మహిళల పాత్ర, ప్రాధాన్యతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుతం కాజీపేటలో వైద్య సేవలు అందిస్తున్న ఆమె మాట్లాడుతూ మహిళా దినోత్సవం ఒక్కరోజుకే పరిమితం కాకూడదని అన్నారు. ప్రతి రోజు మహిళల దినోత్సవంలాగే భావించి మహిళల ప్రతిభను, శక్తిని సమాజం గుర్తించాలని సూచించారు.

## మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలి

**- డాక్టర్ రవళి,** గైనకాలజిస్ట్



మహిళలు ఉన్నప్పుడే ఈ ప్రపంచం కొనసాగుతుందని పేర్కొన్న ఆమె, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మహిళలు ధైర్యంగా నిలబడాలని అన్నారు. కుటుంబం లేదా ఇతరుల మద్దతు లేకపోయినా తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే ధైర్యం ప్రతి మహిళలో ఉండాలని సూచించారు. సైన్యం నుంచి వైద్య, ఇంజినీరింగ్ వంటి అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటగలరని తెలిపారు. భారతదేశ మహిళలు పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో ప్రతిభ చూపగల సామర్థ్యం కలిగి ఉన్నారని పేర్కొన్నారు.
ఏ పని చేయాలన్నా భయం, ఇతరులు ఏమనుకుంటారనే భావనలను పక్కన పెట్టాలని మహిళలకు సూచించారు. సమాజం ఏమనుకుంటుంది, కుటుంబ సభ్యులు ఏమనుకుంటారనే ఆలోచనలతో వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. మహిళలు కేవలం ఇంట్లో ఉండటానికే పుట్టలేదని, జీవితంలో తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.
ఆడపిల్లల విద్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆమె పిలుపునిచ్చారు. పదో తరగతి లేదా మధ్యంతర విద్య తర్వాతే పెళ్లిళ్లు చేయించే పరిస్థితిని నివారించాలని అన్నారు. అమ్మాయిలు తమ వ్యక్తిత్వాన్ని, లక్ష్యాలను అర్థం చేసుకునే వరకు చదువు కొనసాగించేందుకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ముందుగా విద్యతో తమ కాళ్లపై నిలబడే స్థాయికి చేరుకోవాలని, ఆ తర్వాతే పెళ్లి వంటి విషయాలను ఆలోచించాలని చెప్పారు.
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని డాక్టర్ రవళి ఆకాంక్ష వ్యక్తం చేశారు.



మహిళలు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో ముందడుగు వేయాలి

**- బాసాని సంధ్యారాణి**
బీసీ సంక్షేమ సంఘం
జిల్లా మహిళా అధ్యక్షురాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం హన్మకొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు బాసాని సంధ్యారాణి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండి ప్రతిభ చాటాలని ఆమె ఆకాంక్షించారు.

మహిళా దినోత్సవాన్ని కేవలం ఒక రోజుకే పరిమితం చేయకుండా ప్రతి రోజూ మహిళల దినోత్సవంలా భావించాలని ఆమె అన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి సమాజంలోని ప్రతి రంగంలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సూచించారు.
అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో ముందడుగు వేయాలని బాసాని సంధ్యారాణి పిలుపునిచ్చారు. మహిళలు ముందుకు వచ్చినప్పుడే కుటుంబం, సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు.

మన మానవతా స్త్రీమూర్తులందరికీ అంతర్జాతీయ ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ముఖ్యంగా స్త్రీలు ఎక్కడైతే గౌరవింపబడతారో అక్కడ దేవతలు పూజింపబడతారు. కాబట్టి స్త్రీమూర్తులందరూ కూడా ముందుకు వచ్చి తమ శక్తి స్వరూపాలను స్టార్-- చూపించి మహిళలందరూ మేల్కొని, ఏంటంటే వాళ్లలో చైతన్యం రావాలి ముఖ్యంగా. స్త్రీలు ఎదగాలి.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**- పద్మజ,**
సాయి శివాని వెల్ఫేర్ సొసైటీ & లయన్స్ క్లబ్ రీజనల్ చైర్ పర్సన్



స్త్రీలు ఎంతో సాధించాలి. మన భారతదేశ సాంప్రదాయాలని, కట్టుబాట్లని, మన విలువలని కాపాడుతూ ముందుకెళ్లాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటూ, మరి ముఖ్యంగా మహిళలు ఈరోజు ముందుకు రావాలంటే ఎన్నో మహిళలు ప్రతి ఒక అరాచకానికి ప్రతిరోజూ గురవుతున్నారనే వార్తలు రాకుండా ఉండాలంటే మన మహిళలలో చాలా చైతన్యం రావాలి. ఈ చైతన్యం రావాలంటే మహిళలు చదువులో ముందుండాలి. ఇప్పటికీ మన మహిళా శక్తి ఏమీ అంతరించిపోలేదు. మహిళలు ప్రతి అంశంలో కూడా "మేమున్నాము, మేము సైతం" అంటూ కూడా పురుషులతో సమానంగా ముందడుగు వేస్తున్నారు. ఈరోజు మన పొలం పనుల నుండి స్టార్ట్ చేసుకుంటే ఆకాశంలో విమాన్ విమానాన్ని ఎగిరించే అంతవరకు కూడా మహిళల్లో దేనికి వెనుకంజ వేయలేదు. కాబట్టి స్త్రీమూర్తులు ఇంకా ముందుకొచ్చి అన్నిట్లో, అన్ని రంగాలలో ఎదగాలని నేను కోరుకుంటున్నాను.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని సఖి వన్ స్టాప్ కేంద్రం నిర్వాహకురాలు వినీల మహిళలు,బాలికలకు సందేశం అందించారు. మహిళలు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని ఆమె తెలిపారు. మహిళలు మాత్రమే కాదు, ప్రతి బాలిక కూడా తనపై నమ్మకం పెంచుకుని స్వయంగా ప్రయత్నం చేస్తే విజయాన్ని అందుకోవడం సాధ్యమని అన్నారు.

## జీవితంలో చిన్న చిన్న సమస్యలకే నిరాశలోకి వెళ్లకూడదు

**- వినీల,** సఖి సెంటర్ నిర్వాహకురాలు



జీవితంలో చిన్న చిన్న సమస్యలకే నిరాశలోకి వెళ్లకూడదని ఆమె సూచించారు. ప్రతి విషయాన్ని తీవ్రంగా తీసుకుని నిరాశకు లోనైతే అది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబంపైనా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా నిలబడితే కుటుంబాన్ని కూడా బలంగా నిలబెట్టగలరని చెప్పారు. కుటుంబానికి మహిళలే ప్రధాన ఆధారం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. యువతులు, బాలికలు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని సమయాన్ని వృథా చేయకుండా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ రోజు గడిచిన తర్వాత తిరిగి రాదనే విషయాన్ని గుర్తుంచుకుని లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రతి రంగంలోనూ మహిళలు ప్రతిభ చూపుతున్న నేపథ్యంలో ప్రతి యువతి తన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# మహిళలకు ప్రేరణగా నిలుస్తున్న

# కరుణాపురం సర్పంచ్ గుర్రపు రీనా

**మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న ఈ కాలంలో గ్రామ పాలనలో కూడా మహిళల నాయకత్వం ప్రత్యేకంగా నిలుస్తోంది. అలాంటి మహిళల్లో ఒకరు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని కరుణాపురం గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా.**

- ధర్మసాగర్, (తెలంగాణ ముచ్చట్లు)

అతి చిన్న వయస్సులో సర్పంచ్‌గా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న యువ నాయకురాలిగా రీనా గుర్తింపు పొందారు.జీవితంలో ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులు, అవమానాలను ఎదుర్కొన్నా ఆమె వెనక్కి తగ్గలేదు. ఆ అనుభవాలే ఆమెను మరింత ధైర్యంగా, పట్టుదలతో ముందుకు సాగించే శక్తిగా మారాయి.సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతోరాజకీయాల్లోకి అడుగుపెట్టిన రీనా, గ్రామ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని కరుణాపురం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అతి చిన్న వయస్సులో సర్పంచ్‌గా నిలిచింది. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పనిచేస్తున్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా, అవమానాలు మరియు కష్టాలను అధిగమించి నాయకత్వ స్థాయికి చేరుకున్న గుర్రపు రీనా కథ అనేక మహిళలకు ప్రేరణగా నిలుస్తోంది.

"సంకల్పం ఉంటే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరు" అనే సందేశాన్ని తన జీవితంతో నిరూపిస్తూ కరుణాపురం గ్రామ అభివృద్ధి దిశగా ఆమె మరిన్ని మంచి పనులు చేస్తారని గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు.





## గ్రామ అభివృద్దే నా లక్ష్యం

### గుర్రపు రీనా, సర్పంచ్, కరుణాపురం

నేను చిన్న వయస్సులోనే గ్రామ సర్పంచ్ బాధ్యతలు చేపట్టడం నా జీవితంలో ఒక పెద్ద అవకాశం. నాకు ఎదురైన కష్టాలు, అవమానాలు నన్ను వెనక్కి నెట్టలేదు; అవే నన్ను మరింత ధైర్యంగా ముందుకు నడిపించాయి. గ్రామ ప్రజలు నాపై ఉంచిన విశ్వాసం నాకు పెద్ద బలం. కరుణాపురం గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం నా ప్రధాన లక్ష్యం. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు, మౌలిక వసతులను మెరుగుపరచేందుకు నేను ఎప్పుడూ ప్రజల మధ్య ఉండి పనిచేస్తాను. ఈ ప్రయాణంలో నాకు నా కుటుంబం, ముఖ్యంగా నా భర్త ప్రవీణ్ ఇచ్చిన ప్రోత్సాహం ఎంతో కీలకం. మహిళలు సంకల్పంతో ముందుకు వస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని నేను నమ్ముతున్నాను. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి సమాజంలో తమ పాత్రను చాటాలని కోరుకుంటున్నాను. గ్రామ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నా శక్తి మేర సేవ చేస్తాను.



ఈ విజయ యాత్రలో ఆమెకు భర్త గుర్రపు ప్రవీణ్ బలమైన తోడుగా నిలిచారు. ప్రతి అడుగులోనూ ప్రోత్సహిస్తూ, ప్రజాసేవలో ముందుకు సాగేందుకు అండగా నిలుస్తూ ఆమెకు ధైర్యం ఇచ్చారు. ఇద్దరూ కలిసి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామంలో డ్రైనేజ్ సమస్యలు పరిష్కరించడం, మౌలిక వసతులు మెరుగుపరచడం, శుభ్రత కార్యక్రమాలు చేపట్టడం వంటి అభివృద్ధి పనుల్లో రీనా ముందుండి పనిచేస్తున్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకురాలిగా ఆమె మంచి పేరు సంపాదించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in